16 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ఉప్పల్: త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అగస్టు 16 నుంచి 21 వరకు ఉప్పల్ గణేష్ నగర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు రోజుల పాటు కొనసాగే వేడుకల అనంతరం 21 న స్వామి వారి ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వేడుకలకు హాజరు కావాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను శుక్రవారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ,.డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీవరేజ్ సూపర్‌వైజర్ రాకేష్, కాలనీవాసులు కెజిఎస్ రెడ్డి, భూపాల్‌రెడ్డి. వెంకట స్వామి, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



షిరిడీనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. శుక్రవారం ఆయన ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ షిరిడీనగర్, ఎస్ఎండీసీ కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ గతంలో మల్కాజిగిరి సర్కిల్‌లో చిన్నపాటి వర్షానికి కాలనీలు ముంపునకు గురయ్యేవన్నారు. బండచెరువు కింది ప్రాంతాల్లో ఉన్న కాలనీల్లో బాక్స్ డ్రైన్ల నిర్మాణం చేపట్టిన తర్వాత ముంపు సమస్య తగ్గిపోయిందన్నారు. వర్షాలను ఎదుర్కొవడానికి హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్‌రెడ్డి , ఉమేష్‌సింగ్, వెంకటేష్ యాదవ్, సత్యమూర్తి, శ్రీనివాస్, నిరంజన్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతనందిస్తాం



మైక్ సెట్ అందజేస్తున్న లయన్ శ్రీకాంత్‌రెడ్డి

మల్కాజిగిరి: విద్యార్థులకు చేయూత అందించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఎల్లప్పుడూ ముందుంటుందని క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సర్దార్ పటేల్‌నగర్‌లోని అంగన్వాడీ కేంద్రానికి మైక్ సెట్ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే క్లబ్ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్సీ జీడీ శ్రీధర్‌గౌడ్, జెడీస్ పి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి నటరాజ్, గణేష్, వెంకట నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పూజా స్టోర్‌లో చోరీ



మల్లాపూర్: నాచారం మహంకాళేశ్వర సహిత దేవాలయంలో పూజాసోర్ట్‌లో నగదు ఎత్తుకెళ్లిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసు కుంది. పోలీసుల కథనంమేరకు వివరాలిలా ఉన్నాయి.. గురువారం రాత్రి నాచారం మహంకాళీ దేవాలయంలో ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తి ఆలయంలోని హుండీని పగులగొట్టేందుకు ప్రయత్నించాడు. గున్నపంతో హుండీని పగులగొట్టేందుకు చేసి ప్రయత్నాలు ఫలించకపోవడంతో దేవాలయాన్ని అనుకుని ఉన్నా దుర్గా ప్రసాద్‌కు చెందిన పూజాసోర్ట్ గల్లా పెట్టెలో ఉన్నా రూ.35 వేలు ఎత్తుకెళ్లాడు. దేవాలయంలెని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పానీ.. పరేషానీ

గౌతంనగర్ డివిజన్‌లో తాగునీరు అందక ప్రజల ఇబ్బందులు

- అరకొర నీటి సరఫరాతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంచినీటి కష్టాలు నానాటికి తీవ్రమవుతున్నాయి. అరకొర నీటి సరఫరాతో గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. మంచినీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతో కాలంతో సంబంధం లేకుండా ప్రజలు నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నారు. డివిజన్ పరిధిలోని గోపాల్‌నగర్, మల్లికార్జుననగర్, మిర్జాల్‌గూడ, హనుమాన్‌పేట్‌తో పాటు గ్రేటర్ హైదరాబాద్‌లోనే అతి పెద్ద మురికివాడగా గుర్తింపు పొందిన ఇందిరా నెహ్రూనగర్, బీహారీబస్తీ తదితర ప్రాంతాల్లో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం నీటికోసం ఎదురు చూపులు తప్పడం లేదు. రెండు రోజులకోసారి నీరు విడుదల చేస్తున్నారని, అయితే లో ప్రెషర్ కారణంగా ఎగువ ప్రాంతాలకు నీరు సరిగా అందడం లేదని వారు వాపోయారు. బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే వారి ఇబ్బందులు వర్ణనాతీతం. గంటపాటు నీటిని విడుదల చేయాల్సి ఉండగా 40 నిమిషాలకే పరిమితం చేస్తున్నాని, దీనికితోడు లోప్రెషర్ కారణంగా 10 బిందెలు కూడా పట్టుకోలేక పోతున్నామని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. కనీసం తాగునీటి అవసరాలకైనా నీటిని సరఫరా చేయాలని వేడుకుంటున్నారు. గత కొంతకాలంగా ఇందిరానెహ్రూనగర్ కాలనీలో మంచినీటి సమస్యపై జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



మిర్జాల్‌గూడలో లోప్రెషర్‌తో సరఫరా అవుతున్న నీళ్లు

వరద ప్రాంతాల్లో బీఆర్ఎస్ సహాయక చర్యలు



సహాయక చర్యల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని షఫీనగర్, ద్వారకమాయికాలనీ, సుభాష్‌నగర్ తదితర ప్రాంతాలను గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరదనీరు ముంచెత్తడంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు వంశీ ముదిరాజ్, ఎండీ ఉస్మాన్ అర్ధరాత్రి ఆయా ప్రాంతాలకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. హైడ్రాతో పాటు జీహెచ్ఎంసీ సిబ్బందికి సమాచారం అందించి వరదనీరు సాఫీగా వెళ్లేలా తగిన చర్యలు చేపట్టారు. వరదనీరు ఇళ్లలోకి చేరిన కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు.

అన్నకు అనురాగంతో...



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు రాఖీ కడుతున్న గీతామూర్తి

మౌలాలి: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు గీతామూర్తి రాఖీ కట్టి సుఖసంతోషాలతో ఉండాలని, మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్రవారం సిట్ కార్యాలయానికి వచ్చిన బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా గీతామూర్తి నేతృత్వంలో మౌలాలి డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సోమాజిగూడ దిల్‌కుష్ అతిథి గృహంలో ఉన్న బండి సంజయ్‌ను కలిసి రాఖీ కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్కాజిగిరి: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఓల్డ్ మల్కాజిగిరికి చెందిన గోగికర్ మనీషాకు రూ 9500, మల్కాజిగిరికి చెందిన వీరేశంకు రూ 18వేలు, మున్వర్ ఆలీకి రూ 60 వేలు, బాల సరస్వతీనగర్‌కు చెందిన ఖైరున్నీసాబేగంకు రూ 42 వేలు, ఎస్పీనగర్‌కు చెందిన సరితకు రూ 30 వేలు, పటేల్‌నగర్‌కు చెందిన పద్మకు రూ 60 వేలు మంజూరైనట్లు మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో వెంకన్న, శ్రీనివాస్‌గౌడ్, జనార్దన్,ఉస్మాన్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మల్లాపూర్ వార్డు కార్యాయలంలో మల్లాపూర్ మల్లికార్జున్‌నగర్‌కాలనీకి చెందిన యనాల నాగరాజు రెడ్డి, వేముల పద్మ కుటుంబ సభ్యులకు మల్లాపూర్ కార్పొ రేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు నర్సింగ్‌రావు, రాపోలు శ్రీను, రఘు తదితరులు పాల్గొన్నారు.

ముంపు నివారణకు చర్యలు



చిన్మయిమార్గ్‌లో సహాయక చర్యలు చేపడుతున్న జీహెచ్ఎంసీ, హైడ్రా సిబ్బంది

గౌతంనగర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడ, చిన్మయిమార్గ్ తదితర ప్రాంతాల్లో వరదనీరు ముంచెత్తడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు మేలక రాముయాదవ్ నేతృత్వంలో జీహెచ్ఎంసీ, హైడ్రా సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, హైడ్రా సిబ్బంది, చిన్మయిమార్గ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ అభిమానుల ఆత్మీయ సమావేశం



సమావేశమైన వైఎస్ఆర్‌సీపీ అభిమానులు, జగనన్న సైనికులు

అల్వాల్: నేరేడ్‌మెట్ ఆర్‌కేపురంలోని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర నాయకులు తడక జగదీశ్వర్‌గుప్తా నివాసంలో శుక్రవారం తెలంగాణ వైఎస్ఆర్‌సీపీ అభిమానులు, జగనన్న సైనికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన నాయకులు నర్సింహరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ఆర్‌సీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి, పాకాల డానియల్, రాజ్‌కుమార్, సుమన్‌గౌడ్, శ్రీను, శ్రీదేవి, సుమతిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ అభిమానులు, జగనన్న సైనికులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపోచమ్మ ఆలయ పునఃప్రతిష్ఠాపన



పూజల్లో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, పర్వతాపూర్‌లో వెలసిన పోచమ్మ తల్లి దేవాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడు రోజులుగా వేదపండితుడు నరేష్ శర్మ నేతృత్వంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్నారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ అమర్ సింగ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా తీజ్ వేడుకలు



తీజ్ వేడుకల్లో పాల్గొన్న బొంతు శ్రీదేవి..

కుషాయిగూడ: బంజారాల తీజ్ పండుగ వేడుకలు చర్లపల్లి డివిజన్, మారుతీనగర్‌లో ఘనంగా జరిగాయి. గత పది రోజులుగా పెంచిన మొలకలను ఆరాధ్యదైవానికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బంజారా నృత్యాలతో హోరెత్తించారు. వేడుకల్లో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటి సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి పాల్గొని తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బంజారా నాయకులు హనుమంతునాయక్, శ్రీను నాయక్, కిషన్, శ్రీనివాస్, ఇస్లావత్ హరినాయక్, నర్సింహ్మానాయక్, గోవింద్ నాయక్, దశరథ నాయక్, రెడ్డి నాయక్, అరుణ, నిర్మల, మున్ని పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

శామీర్‌పేట్: భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మూడు చింతలపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... భూ భారతి ఆన్‌లైన్ ద్వారా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఎంత వరకు పరిష్కారమయ్యాయని స్థానిక తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి కారణాలపై ఆరా తీశారు. సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉంటే వెంటనే క్లియర్ చేసుకోవాలని సూచించారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు



కుషాయిగూడలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి అమ్మవారిని శుక్రవారం వరలక్ష్మి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వర్ణ కవచంతో అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ అమ్మవారిని పూజిస్తే అష్టైశ్వరాలైన సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి లభిస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ పేర్కొన్నారు. అనంతరం మహిళలు పసుపు, కుంకమ ఇచ్చిపుచ్చుకున్నారు.

కుషాయిగూడ పరిధిలో..

చర్లపల్లి, మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌లలో శుక్రవారం మహిళలు వరలక్ష్మీ వ్రత మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.



వరలక్ష్మీ వ్రతం వేడుకల్లో పాల్గొన్న మహిళలు

మహదేవ్‌పూర్‌లో జీహెచ్ఎంసీ అధికారుల పర్యటన

అల్వాల్: కొకూర్ మహదేవ్‌పూర్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు దెబ్బతినడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు సమస్యను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజనీరు రఘు, పలువురు కాంగ్రెస్ నాయకులు మహదేవ్‌పూర్‌లో పర్యటించారు. రోడ్లను పరిశీలించి దెబ్బతిన్న రోడ్ల స్థానంలో సీసీ రోడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు తుడిమెళ్ల మల్లిఖార్జున్, కిరణ్, ఆరీఫ్, అహ్మద్, శివ, మణీష్, హరినాధ్, ఆదిత్య, సందీప్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



మహదేవ్‌పూర్‌లో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

విద్యార్థులు సోదరభావంతో మెలగాలి



రాఖీ కడుతున్న విద్యార్థినులు



రాఖీలు వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

బోడుప్పల్: విద్యార్థులు పరస్పరం సోదరభావంతో మెలగాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు పాల్గొని రాఖీలు కట్టుకుని మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నా, చెల్లెళ్ల అనుబంధానికి రక్షా బంధన్ ప్రతీకగా నిలుస్తుం దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి డివిజన్‌లో..

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారమే రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమి విశిష్ఠతను ఉపాధ్యాయులు చిన్నారులకు వివరించారు.

చిలుకానగర్‌లో కార్పొరేటర్ పర్యటన

ఉప్పల్: భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. శివాలయం వీధి, పెద్ద మజీద్, మరల మైసమ్మ, ఎస్సీ కమ్యూనిటీ హాల్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆమె దెబ్బతిన్న రోడ్లు, స్ట్రామ్ వాటర్ లైన్‌ల పునరుద్ధరణ తదితర అంశాలపై అధికారులతో కలిసి చర్చించారు. అనంతరం మాట్లాడుతూ దెబ్బతిన్న పైప్ లైన్లు, సీవరేజ్ పైప్ లైన్‌లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ వినీల్ గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, జల మండలి మేనేజర్ సత్యనారాయణ, బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, ఎద్దుల కొండల్ రెడ్డి, కోకుండా జగన్, చేర్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చిలుకానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఘనంగా మహా కుంభసంప్రోక్షణ



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాల్గో రోజు శుక్రవారం సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, వసంతోత్సవం, ఆలయ శిఖరానికి మహాకుంభ సంప్రోక్షణ, రాత్రి పుష్పయాగం తదితర పూజా కార్యక్రమాలు ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ స్వామి వారిని దర్శించుకున్నారు.ఈవో రవీందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, గుండా నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- జవహర్‌నగర్ పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

జవహర్‌నగర్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అదించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమాగౌరితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం భవనం చుట్టూ తిరిగి పరిసరాలను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో మురుగునీరు రాకుండా చర్యలు తీసుకుంటామని, భవన నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మ, సిబ్బంది పాల్గొన్నారు.



జవహర్‌నగర్ పీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి, డీఎంహెచ్ ఉమాగౌరీ